సాక్షి కర్నూలు

బుధవారం ; 11 ; జనవరి ; 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన జి.చంద్రశేఖరరెడ్డి రూ.లక్ష విరాళం అందించారు.



అలరించిన భక్తి రంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎం.కామేశ్వరి బృందం నిర్వహించిన భక్తిరంజని కార్యక్రమం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,622.45
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:68.473
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,493

న్యూస్‌రీల్

పన్నులు వంద శాతం వసూలు చేయాలి



ఆలూరులో మొక్కలు నాటుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

ఆస్పరి/ఆలూరు రూరల్: గ్రామ పంచాయతీలకు సంబంధించిన పన్నులు వంద శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశించారు. మంగళవారం ఆస్పరి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూలులో ఆస్పరి మండలం వెనుకంజలో ఉందన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోపు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఆలూరులోని చెత్త సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు, ఈఓ కృష్ణ కుమార్ సిబ్బంది ఉన్నారు.

సూక్ష్మ సేద్యం సామగ్రిని సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ హరినాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): బిందు, తుంపర సేద్యం కింద ఎంపికైన రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సామగ్రిని సరఫరా చేయడంతో పాటు వాటిని అమర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి సీబీ హరినాథరెడ్డి కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఉద్యాన భవన్‌లో డ్రిప్, స్ప్రింక్లర్ల కంపెనీల ప్రతినిధులు, ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 6,500 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 5,300 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్య సదుపాయం కల్పించాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. మార్చి నెల చివరిలోపు లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి,ఏపీడీ రాజకృష్ణారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, ఉద్యాన అధికారి మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో కర్నూలు జిల్లాకు రెండో స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 2వ స్థానం నిలిచింది. చిత్తూరు జిల్లా మొదటి స్థానం, నంద్యాల జిల్లా ఐదో స్థానంలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. జనవరి నెల పింఛన్ల పంపిణీ ఈ నెల 9వ తేదీతో ముగిసింది. కర్నూలు జిల్లాలో 2,40,357 ఫించన్‌లు ఉండగా 2,38,906 పింఛన్‌లు (99.40 శాతం) పంపిణీ చేశారు. పింఛన్‌ల కింద జిల్లాకు రూ.66.78 కోట్లు విడుదల కాగా... రూ.66.36 కోట్లు పంపిణీ అయింది. నంద్యాల జిల్లాలో 2,18,305 పింఛన్‌లు ఉండగా...2,16,868 (99.38 శాతం) పింఛన్‌లు పంపిణీ అయ్యాయి. నంద్యాల జిల్లాకు పింఛన్ల పంపిణీకి రూ.60.21 కోట్లు విడుదల చేయగా.. రూ.59.81 కోట్లు పంపిణీ చేశారు. మిగిలిన నగదును వెంటనే ప్రభుత్వానికి జమ చేయాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

20లోపు తప్పులు ఉంటే సవరించాలి

కర్నూలు సిటీ: ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు కొందరు తప్పుగా ఇచ్చారని, వాటిని ఈ నెల 20వ తేదీలోపు సవరించాలని డీఈఓ డాక్టర్ రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరు కానున్న పిల్లల వివరాలు వెబ్ దరఖాస్తులలో తెలిపిన వివరాలను ధ్రువీకరించారని, ఇందులో ఏవైన తప్పులు ఉంటే బుధవారం నుంచి 20వ తేదీలోపు సవరించేందుకు ఎడిట్ ఆప్షన్‌ను హెచ్ఎంలకు ఇచ్చారన్నారు. ఈ అవకాశాన్ని హెచ్ఎంలు సరి చూసుకోని తప్పులు ఉంటే సరి చేయాలని డీఈఓ సూచించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12వ తేదీ నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మంగళవారం కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా వాల్‌పోస్టర్లను ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అన్సర్ అహమ్మద్‌తో కలిసి ఆయన విడుదల చేశారు.



హొళగుందలో మహదేవ నిర్మించుకున్న ఇల్లు



గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్న తుగ్గలి మండలం రాతనలోని జగనన్న కాలనీ

గుండె గూటికి పండగొస్తోంది!

రెక్కల కష్టాన్ని నమ్ముకున్న వారు కొందరైతే.. చిరు వ్యాపారులు మరి కొందరు.. చిన్నాచితకా పనులు చేసే వారు ఇంకొందరు.. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తూ వచ్చారు. చాలీచాలని సంపాదనతో ఇంటి నిర్మాణం కలగానే మిగిలింది. అద్దె ఇళ్లల్లో అష్టకష్టాలు పడుతున్న వీరికి రాష్ట్రప్రభుత్వం అండగా నిలిచింది. ఉచితంగా ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేసింది. ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేసి గృహ నిర్మాణానికి అవసరమైన ఆర్థిక చేయూత ఇస్తోంది. ఉగాది నాటికి సొంతింటి కల సాకారం కానుండడంతో పేదల గుండెల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

అందుబాటులో ఇసుక, స్టీల్, సిమెంట్

గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌ను ఎప్పటికప్పుడు అవసరాల నిమిత్తం లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. ఇసుకకు సంబంధించి జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ప్యాలకుర్తి, కోసిగి, నందవరం, టీవీ 9 కాలనీ, ఈర్లదిన్నె ప్రాంతాల్లో ప్రత్యేకంగా డిపోలను ఏర్పాటు చేసి, ఇసుకను బల్క్‌గా ఉంచారు. అలాగే జిల్లాలోని 20 గోడౌన్లలో 400 మెట్రిక్ టన్నుల సిమెంట్, 2 వేల మెట్రిక్ టన్నుల స్టీల్ నిల్వలు ఉన్నాయి.

కర్నూలు(అర్బన్): పేదలకు గృహయోగం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం జిల్లాలో 344 వైఎస్సార్ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. ఈ కాలనీల్లో మొత్తం 46,900 గృహాలు మంజూరయ్యాయి. ఉగాది పండుగ నాటికి 13,666 గృహాలు పూర్తి చేసి పేదలతో ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో రూ.223 కోట్లు వెచ్చించి అంతర్గత రోడ్లు నిర్మించారు. అలాగే విద్యుత్, నీటి వసతిని కల్పించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసిన నాలుగైదు రోజులకే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతున్నాయి. ఆదోని అర్బన్ పరిధిలోని లేఅవుట్లలో రూ.14.58 కోట్లతో అప్రోచ్ రోడ్ల పనులను ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు రూ.6.85 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు ఉండడంతో గృహ నిర్మాణాల వేగం పెరుగుతోంది.

- ఉగాది నాటికి 13,666 గృహ ప్రవేశాలు
- ఇప్పటికే 6,200 పూర్తి.. రూఫ్ కాస్ట్, లెవెల్‌లో 5,261
- వేర్వేరు దశల్లో 2,205 గృహాలు
- గోడౌన్లలో సిద్ధంగా 400 మెట్రిక్ టన్నుల సిమెంట్
- అందుబాటులో 2 వేల మెట్రిక్ టన్నుల స్టీల్
- కొరత లేకుండా ఎనిమిది స్టాక్ పాయింట్లలో ఇసుక
- 22,199 మంది పొదుపు మహిళలకు రూ.77.69 కోట్ల రుణం



నందవరంలో గృహ నిర్మాణాల దృశ్యం

పొదుపు మహిళలకు రూ.77.69 కోట్ల రుణాలు

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఇప్పటి వరకు మొత్తం 22,199 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35వేల ప్రకారం రూ.77.69 కోట్లను రుణంగా అందించారు. గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు ఈ మొత్తం కూడా వారికి అందడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు కూడా గృహ నిర్మాణాల్లో బిజీ అయిపోయారు.

అద్దె కష్టాలు తొలగాయి



ప్రతి నెలా అద్దె ఇంటికి రూ.4 వేలు చెల్లిస్తూ వచ్చాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇంటి పూర్తి చేసి సొంత ఇంటిలో ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు అందాయి. నేను ఇల్లు నిర్మించుకున్న కాలనీలో నీటి వసతి ఉంది. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. సొంత ఇంటిలో ఉంటున్నందుకు చాలా ఆనందంగా ఉంది. – ఎం మహదేవ, హొళగుంద

త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం



గ్రామంలో చిన్న కూల్ డ్రింక్ షాపు పెట్టుకొని భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తున్నా. బాడుగ ఇంట్లోనే ఉంటున్నా. నాకు ఎలాంటి భూమి, సొంత ఇల్లు లేదు. ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు గృహాన్ని కూడా మంజూరు చేసింది. దీంతో జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టాను. ఫ్లోరింగ్ పని మాత్రం మిగిలింది. ఈ పనిని కూడా పూర్తి చేసి త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం.

– రాముడు, చిన్నహుల్తి, పత్తికొండ మండలం

చాలా సంతోషంగా ఉంది



మేం పదేళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. నా భర్త మల్లయ్య, నేను కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. ప్రభుత్వం మాకు ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చింది. ఇల్లు కూడా మంజూరు చేసింది. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో ఇప్పటి వరకు లెంటల్ లెవల్ వరకు ఇంటిని నిర్మించుకున్నాం. త్వరలోనే సొంతింటి కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మి, అరికెర, ఆలూరు మండలం

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు ఉగాది నాటికి 13,666 గృహ ప్రవేశాలను చేయించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ అంతా సిద్ధంగా ఉంది. సిమెంట్, స్టీల్, ఇసుకను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచాం. నిధుల సమస్య కూడా లేదు. చేసిన పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసిన వెంటనే విడుదలవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఇంజినీర్లు, సిబ్బందికి రోజువారి లక్ష్యాలను నిర్ణయించాం. ఇప్పటి వరకు జిల్లాలో గృహ నిర్మాణాలకు రూ.238 కోట్లు వెచ్చించాం.

– కే వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్

సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

ఆదోని రూరల్: అధికారులందరూ సమన్వయంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు తహసీల్దార్, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం ఆదోని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి పది మంది ఉద్యోగులు, దాదాపు 20 మంది వలంటీర్ల చొప్పున మండలానికి సగటున 500 మంది ఉద్యోగుల పనిచేస్తున్నప్పటికీ కూడా అనుకున్న రీతిలో ప్రజలకు సేవలు అందడం లేదన్నారు. తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు ప్రతి సచివాలయాన్ని వారంలో ఒకసారి తప్పకుండా తనిఖీ చేసి పర్యవేక్షించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించేలా తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ తరచూ సమీక్ష నిర్వహించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నేడు నోటిఫికేషన్

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో పదవీ విరమణ పొందిన ముగ్గురు పాలకవర్గ సభ్యుల స్థానంలో కొత్తవారి ఎంపికకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారి హరిబాబు తెలిపారు. దొర్నిపాడు మండలం డబ్ల్యూ కొత్తపల్లెకు చెందిన భూమా నారాయణరెడ్డి, ఉయ్యాలవాడ మండలం ఇంజేడుకు చెందిన కె.విశ్వనాథరెడ్డి, పాణ్యం మండలం గోనవరానికి చెందిన బి.సుబ్బరాయుడు పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్త వారి ఎన్నికకు ఈ నెల 11న నోటిఫికేషన్, 17న నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, 18న ఉపసంహరణ, 25న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. మూడు స్థానాలకు ముగ్గురు మాత్రమే నామినేషన్లు వేస్తే 18వ తేదీనే ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమంలో వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఏ సమస్య ఎదురైనా ముందుగా సంబంధిత లైన్‌మెన్, ఏఈ, ఏఈడీ, ఈఈలకు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రతి మంగళవారం నిర్వహించే డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అలాగే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఉచితంగా ఫిర్యాదు చేస్తే పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

నేడు 'జగనన్న తోడు' వడ్డీ రాయితీ విడుదల

- జిల్లాలో 16, 226 మంది చిరు వ్యాపారులకు రూ.33.28 లక్షల వడ్డీ రాయితీ
- బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గ్రామీణ ప్రాంతాల్లో 9,285, అర్బన్ ప్రాంతాల్లో 6,941 మందికి ప్రయోజనం

కర్నూలు(అగ్రికల్చర్): కరోనా విపత్తులో ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. జగనన్న తోడు కింద బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడంతో పాటు.. రుణాలను సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కూడా ఇస్తోంది. చిరు వ్యాపారులకు 5వ విడత జగనన్న తోడు కార్యక్రమం కింద వడ్డీ రాయితీ విడుదలకు రంగం సిద్ధమైంది. జిల్లా మొత్తం మీద 16,226 మంది చిరు వ్యాపారులకు రూ.33,28,437 వడ్డీ రాయితీ ప్రయోజనం కలుగనుంది. వీరికి 2022 జూన్ నుంచి డిసెంబరు నెల వరకు ఆరు నెలల వడ్డీని ప్రభుత్వం విడుదల చేయనుంది. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు కింద చిరు వ్యాపారులకు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి వడ్డీ రాయితీ విడుదల చేయనున్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొంటారు. జగనన్న తోడు కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి డీఆర్‌డీఏ-వైకేపీ అమలు చేస్తోంది. జిల్లాలోని 25 మండలాల్లో 9,285 మంది చిరు వ్యాపారులకు బ్యాంకులు రూ.10 వేల ప్రకారం రుణాలు ఇచ్చాయి. ఈ నిధులతో వీరు వ్యాపారాలను అభివృద్ధి చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా ఆరు నెలల వడ్డీ రాయితీ కింద రూ.14,54,026 విడుదల కానుంది. ఆదోని మండలంలో అత్యధికంగా 805, ఆలూరు మండలంలో 724, కర్నూలు రూరల్‌లో 652, దేవనకొండలో 574 మంది చిరు వ్యాపారులు వడ్డీ రాయితీ పొందుతున్నారు. అలాగే అర్బన్ ప్రాంతాల్లో జగనన్న తోడు కార్యక్రమాన్ని మున్సిపాలిటీలు అమలు చేస్తున్నాయి. కర్నూలు నగరపాలక సంస్థతో పాటు గూడూరు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలకు సంబంధించి 6,941 మంది చిరు వ్యాపారులకు రూ.18,74,437 వడ్డీ రాయితీ విడుదల కానుంది. కర్నూలు అర్బన్‌లో 3,566 మంది, ఆదోనిలో 1,762, గూడూరులో 356, ఎమ్మిగనూరులో 1,257 మంది చిరు వ్యాపారులకు ఆరు నెలల వడ్డీ రాయితీ లభిస్తోంది.

వైభవంగా వసంతోత్సవం



ఊరేగింపులో రంగులు చల్లుకుంటున్న భక్తులు



ఉత్సవ మూర్తికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా ఎమ్మిగనూరులో చివరిరోజు మంగళవారం రాత్రి వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తి నీలకంఠేశ్వరస్వామిని పల్లకీపై ఉంచి ఊరేగించారు. ఈ ఉత్సవంలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. స్థానిక శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయం నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయం, సోమేశ్వర సర్కిల్, శ్రీనివాస సర్కిల్, అటు నుంచి ట్యాంక్‌బండ్ రోడ్డు మీదుగా బొడ్డురాయి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగించారు. అక్కడ బావిలో స్వామివారికి పండితులు చక్రస్నానం నిర్వహించి, గంధోత్సవం చేపట్టారు. అనంతరం వసంతం నిర్వహిస్తూ స్వామివారి ఆలయానికి చేరుకుని ఉత్సవ మూర్తిని ఆలయంలో కొలువుంచారు. కార్యక్రమంలో ఈఓ దినేష్‌చౌదరి, ఆలయ ధర్మకర్త నీల మురళీధర్, ఆలయ కమిటీ సభ్యులు శివశంకర్, శ్రీకాంత్, సురేష్, వెంకటేశులు, శ్యామ్,ఆచారి పాల్గొన్నారు.

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో గురువారం నుంచి మకర సంక్రాంతి బ్రహ్మోత్సాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామి అమ్మవార్లకు విశేషపూజలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం, చండీహోమం, నిత్యహవనాలు జరిపిస్తారు. రెండో రోజు శుక్రవారం నుంచి స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలు నిర్వహిస్తారు. మకర సంక్రాంతి రోజున స్వామిఅమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం జరిపిస్తారు. 17వ తేదీ ఉదయం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ చేస్తారు. చివరిరోజు 18న పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా 12 నుంచి 18వ తేదీ వరకు ఆలయంలో జరిగే ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, నిలుపుదల చేశారు. భోగి రోజున ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగాణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో చిన్నారులకు సామూహిక భోగిపండ్ల కార్యక్రమం నిర్వహిస్తారు. 15న మహిళలకు ముగ్గుల పోటీలు, 17న దేవస్థానం, వేదపండితులతో వేదశ్రవణం చేపడుతారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



మల్లెపల్లెలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మల్లెపల్లె పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కమ్యూనిటీ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (డక్ అవుట్ పాండ్) నిర్మాణాన్ని, పనులు చేస్తున్న కూలీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్చువల్ మీటింగ్‌లో కమిషనర్ కోన శశిధర్ పీడీతో మాట్లాడుతూ అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులుతో మాట్లాడారు. 46 మంది డిమాండ్‌లో 31 మంది హాజరు తెలుసుకుని కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ తర్వాత కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని సిబ్బంది సమాధానమిచ్చారు. పీడీ వెంట ఏపీఓ రాజునాయక్, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, ఈసీ భరత్, టీఏ రామాంజనేయులు ఉన్నారు.

పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలి

- డీఐజీ సెంథిల్ కుమార్



ప్రసంగిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు: జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అత్యంత ప్రముఖుల వద్ద వ్యక్తిగత భద్రత నిర్వహించే పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్(పీఎస్‌ఓస్) నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సూచించారు. గత పది రోజులుగా 384 మంది పీఎస్‌ఓలకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో (డీటీసీ) మంగళవారం శిక్షణా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని ఏఆర్ పోలీసులు నాలుగు బ్యాచ్‌లుగా వీఐపీలకు (సెక్యూరిటీ) కల్పించడంపై శిక్షణ పొందారు. ముగింపు కార్యక్రమానికి డీఐజీ సెంథిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన పీఎస్‌ఓ(ఏఆర్ పోలీసులు/గన్‌మెన్‌లు)లకు డీఐజీ పలు సూచనలు, సలహాలు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ ఆశీర్వాదం, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటాద్రి, డీటీసీ సీఐ శివశంకర్, ఐఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

వెల్దుర్తి: తమ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఏపీజీబీ బ్యాంకు చైర్మన్ రాకేశ్ కశ్యప్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బ్రాంచ్‌ను సందర్శించి ఖాతాదారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో వెల్దుర్తి బ్రాంచ్‌లో ఏటీఎం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపీజీబీ యాప్ ద్వారా ప్రపంచంలోని ఎక్కడి నుంచైనా ఖాతా తెరవచ్చున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకుడు బొమ్మన దశరథరామిరెడ్డి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ చంద్రశేఖర్ ఆజాద్, స్థానిక బీఎమ్ విజయభాస్కర్ రెడ్డి, ఆర్ఓ మేనేజర్ రవితేజ, సిబ్బంది లింగన్న, రుష్యేంద్ర, వరలక్ష్మి పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ అర్హుల వివరాలు విడుదల

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ కర్నూలు రీజియన్‌లో అప్రెంటిషిప్ పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులైన వారి వివరాలు విడుదల చేసినట్లు ఆర్టీసీ కళాశాల ప్రిన్సిపాల్ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ అభ్యర్థులు తమ వివరాలు తెలుసుకునేందుకు 73828 69399 ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



పాణ్యం: శాంతిరాం ఆసుపత్రి వద్ద ఉన్న జీఎంఆర్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటాయని, పసుపు కలర్ టీషర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చేతిపై పి ప్లస్ సీ అనే అక్షరాలు పచ్చబొట్టు ఉందన్నారు. సమాచారం తెలిసిన వారు 9121101069, 9121101095ను సంప్రదించాలన్నారు.

గారపట్టిన పళ్లు.. వంకరపోయిన కాళ్లు!

☛ ఆస్పరి మండలం బిల్లేకల్ గ్రామంలో బంగారు రమ్య అనే విద్యార్థినికి పళ్లు పుచ్చిపోయి, గారపట్టాయి. మూత్ర పరీక్ష చేయగా ఫ్లోరైడ్ శాతం 4.2 పీపీఎం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

☛ ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో రంజిత్‌కుమార్ అనే విద్యార్థికి పళ్లు దెబ్బతిన్నాయి. మూత్రపరీక్షలో ఫ్లోరైడ్ శాతం 3.9 పీపీఎంగా నిర్ధారించారు.


☛ కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో షేక్షావలి అనే విద్యార్థికి దంత సమస్యలు తలెత్తడంతో వైద్యులు మూత్ర పరీక్షలు నిర్వహించా రు. ఫ్లోరైడ్ శాతం 3పీపీఎంగా ఉన్నట్లు తేలింది.

☛ గజ్జహళ్లి పీహెచ్‌సీ పరిధిలో మదిలింగదహళ్లి గ్రామంలో అఖిల అనే విద్యార్థినికి పళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వైద్యబృందం మూత్రపరీక్ష చేశారు. ఫ్లోరైడ్ శాతం ఏకంగా 3.9 పీపీఎం ఉండటం గమనార్హం.

106 గ్రామాల్లో ఫ్లోరైడ్ భూతం

- 363 మంది విద్యార్థులకు ఫ్లోరోసిస్
- వ్యాధికి కారణమవుతున్న తాగునీరు
- రక్షిత మంచినీటి పథకాలున్న చోటా కేసులు
- వైద్య ఆరోగ్య శాఖ సర్వేలో వెల్లడి
- కేసులు లేవంటున్న ఆర్‌డబ్ల్యూఎస్





ఫ్లోరోసిస్‌కు గురైన పళ్లు గరె పట్టిన దృశ్యం, ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలను సూచించే మ్యాప్





ఫ్లోరోసిస్‌కు గురైన పెద్దలు

కర్నూలు(హాస్పిటల్): ఫ్లోరైడ్ భూతం జీవితాలను తలకిందులు చేస్తోంది. తాగునీరు, ఆహారంలో ఫ్లోరైడ్ కలుస్తుండటంతో గ్రామాల్లో అంగవైకల్యాని కి గురయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. దశాబ్దాలు గా రక్షిత మంచినీటి పథకాలున్నా ఇప్పటికీ ఫ్లోరోసిస్ కేసులు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఆ ఊసే లేదని చెబుతున్నా వాస్తవం మరోలా ఉంటోంది. జిల్లాలో 4,242 చేతిపంపులు, 801 ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, 905 మినీప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, 152 డైరెక్టర్ పంపింగ్, 32 కాంప్రెహెన్సివ్ ప్రొటెక్టివ్ వాటర్ సప్లయ్ ద్వారా గ్రామాల్లో రక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని పరీక్షించేందుకు కర్నూలు, ఆదోని, ఆలూ రులలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని 721 నివాసిత ప్రాంతాల్లో 15,37,960 మంది నివసిస్తున్నారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ అండ్ కంట్రోల్ ఫ్లోరోసిస్ కింద జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ గత మూడేళ్లుగా పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 106 ప్రాంతాల్లో ఫ్లోరైడ్ ఉన్న ట్లు నిర్ధారించారు. 107 గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి 363 మంది ఫ్లోరోసిస్ ప్రభావిత చిన్నారులను గుర్తించారు. ఈ వ్యాధికి గురైన పిల్లలు, పెద్దలకు ఉపకరణాలు, చేతి కర్రలు ఇవ్వడంతో పాటు చిన్నారులకు దంతచికిత్సలు చేస్తున్నారు.

తాగునీరు, ఆహారంలో ఫ్లోరైడ్

తాగునీటితో పాటు పలు ఆహార పదార్థాల్లోనూ ఫ్లోరైడ్ పరిమాణం 1.5 పీపీఎం కంటే అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధిక శాతం గ్రా మాల్లో మంచినీటి కుళాయిలు, బోర్లు, ఆర్ఓ ప్లాంట్ల ద్వారా వచ్చే నీటిని ప్రజలు తాగుతున్నారు. కానీ కొన్నిచోట్ల ఆర్ఓ ప్లాంట్ల ద్వారా వచ్చే నీటిలోనూ పీపీఎం స్థాయి అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దీంతో పాటు నల్ల ఉప్పులో పీపీఎం అధికంగా ఉంటుందని,ఇది ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, హోటళ్లు, రెస్టారెంట్లలో అధికంగా కలుపుతున్నట్లు వెల్లడైంది.

ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు

డెంటల్ ఫ్లోరోసిస్‌లో పంటిపై పసుపుపచ్చగా గార పట్టడం, పళ్లకు పళ్లకు మధ్య గుంతలు పడటం, చాక్‌పీస్ కలర్‌లో పళ్లు ఉండటం, పళ్లపై నల్లటి చుక్కలు ఏర్పడటం, చిగుళ్ల మధ్య నశం రంగులో ఉండటం, పిప్పిపళ్లు, వంకరకాళ్లు, మెడ ఛాతీ వద్దకు వంచలేకపోవడం, రెండు అరచేతులు మెడవద్దకు తీసుకురాలేకపోవడం, వంగిపాదాలు పట్టుకోలేకపోవడం, కడుపు ఉబ్బరం, ఆకలి తగ్గిపోవడం, వాంతికి వచ్చినట్లు ఉండటం, మలబద్ధకం, డయేరియా, తలనొప్పి, అతి దప్పిక, అతి మూత్రం, నీరసం, నిస్సత్తువ, కీళ్లనొప్పులు, రక్తహీనత, మరుగుజ్జుగా ఉండటం, గర్భిణులకు అబార్షన్లు కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనివల్ల పిల్లలు పాఠశాలకు సరిగ్గా వెళ్లలేకపోవడం , డ్రాపవుట్స్ సంఖ్య పెరగడం, పెద్దల్లో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.

జిల్లా కలెక్టర్‌కు నివేదించాం



ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు, కేసుల నమోదును జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే నివేదించాం . ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు నివేదిక పంపి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ వ్యాధికి చికిత్స లేదు. కేవలం నివారణ ఒక్కటే మార్గం. ప్రజలు రక్షిత మంచినీరు మాత్రమే తాగాలి. ఫ్లోరైడ్ ఉన్న పదార్థాలను తినరాదు. మంచి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఎంహెచ్ఓ, కర్నూలు

రక్షిత మంచినీటిని అందిస్తున్నాం



జిల్లాలోని 25 మండలాల్లో ప్రజలకు సమగ్ర రక్షిత తాగునీటి పథకాల ద్వారా నీటిని అందిస్తున్నాం. ప్రస్తుతం ఎక్కడా ఫ్లోరైడ్ ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. కొందరు వృద్ధుల్లో గతంలో ఉన్న ఫ్లోరోసిస్ లక్షణాలు కనిపిస్తూ ఉండవచ్చు. ఎప్పటికప్పుడు నీటిని మూడు ల్యాబ్‌ల ద్వారా పరీక్షిస్తూనే ఉన్నాం. ప్రజలు రక్షిత తాగునీటిని మాత్రమే తాగితే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– బి.నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కర్నూలు జిల్లా

యువకుడి ఆత్మహత్య



గడ్డం మహేశ్వరరెడ్డి (ఫైల్)

కర్నూలు: నంద్యాల జిల్లా అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన గడ్డం మహేశ్వరరెడ్డి (32) పురుగు మందు తాగి కర్నూలులోని ఓ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం ఉదయం మృతి చెందాడు. శివవరం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, అనసూయ దంపతుల కుమారుడు మహేశ్వరరెడ్డి ఎంబీఏ పూర్తి చేశాడు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువు కాకర్ల శ్రీవాణితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఉపాధి కోసం కొంతకాలం క్రితం కర్నూలులో ఉంటున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో పాటు ఉపాధి లభించకపోవడంతో ఈనెల 8వ తేదీ రాత్రి విఠల్ నగర్ ఆర్చి సమీపంలోని సవారమ్మ గుడి వద్ద పురుగు మందు తాగి చనిపోతున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు హడావుడిగా అక్కడికి చేరుకునేసరికి పురుగు మందు తాగి మహేశ్వరరెడ్డి అపస్మారక స్థితిలో పడివుండగా ఆసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించారు. కోలుకోలేక చనిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధానికి ఇద్దరు బలి

- ఆర్ఎస్ రంగాపురంలో వదిన, మరిది ఆత్మహత్య

బేతంచెర్ల: వివాహేతర సంబంధం ఇద్దరు ప్రాణాలు తీసింది. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కమలపాటి అశోక్ (28)అనే యువకుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఆటోనడుపుకుంటూ జీవించే ఈ యువకుడు వరుసకు వదిన అయిన వివాహిత(27)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో పెద్దలు ఇద్దరికి నచ్చ జెప్పారు. అయినా, వారిలో మార్పు రాలేదు. దీంతో అశోక్‌ను వదిలి నెలరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మరోవైపు వివాహితను కుటుంబ సభ్యులు మందలించారో మరేమో తెలియదు మంగళవారం ఉదయం ఆమె అశోక్ ఇంటికెళ్లింది. ఆ తర్వాత ఇద్దరు కలిసి ఆత్మహత్య చేసుకున్నారు. అశోక్ ఉరి వేసుకోగా, ఆమె పురుగుల మందు తాగింది. కొద్దిసేపటి తర్వాత ఇంటి పక్కల వారు గమనించి తలుపులు తీయగా ఇద్దరు విగతజీవులుగా కనిపించారు. సమాచారం అందుకున్న సీఐ ప్రియతం రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. తర్వాత ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సిటీ): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలోకి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల డీఈఓ అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 31లోపు www. nvsadmissionclassix.in లేదా www. navodaya.gov.in అను వెబ్ సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 29వ తేదీన పరీక్షలు ఉంటాయని, పూర్తి వివరాలకు 08512-294545 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వినియోగదారుల బ్రహ్మాస్త్రం 1967

- ఇక పౌరసరఫరా, తూనికలు, కొలతల శాఖల్లో మోసాలకు చెక్
- టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానిస్తూ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్
- నేటి నుంచి అందుబాటులోకి

కర్నూలు(సెంట్రల్): గుండు పిన్ను నుంచి గూగుల్ సేవల వరకు.. పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు...రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ-కామర్స్ సంస్థల దోపిడీ వరకు.. ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా.. వస్తువుల్లో నాణ్యతా లోపించినా.. వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందిస్తోంది. ఫిర్యాదుల, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 1967 నంబర్‌ను రాష్ట్ర పౌర సరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారుల, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఫిర్యాదులను 18004250082/1967 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు ఫిర్యాదులకు 18004253157/14445 టోల్ ఫ్రీ నంబర్, రాష్ట్ర ఆహార కమిషన్‌కు ఫిర్యాదుల, సలహాలు, సూచనలు చేసుకునేందుకు 180004252388/155235 టోల్‌ఫ్రీ నంబర్, తూనికలు, కొలతల శాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 18004254205 టోల్ ఫ్రీనంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరి చేయడానికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నంబర్లకు గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 అనే నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఎలాంటి ఫిర్యాదులు చేయవచ్చు...

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు వినియోగదారుల, వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులను చేయవచ్చు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికల కొలతలు అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. అదేవిధంగా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదును సంబంధిత శాఖల పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తరువాత ఫిర్యాదు ఏ దశలో ఉన్నదో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయా లని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భా గంగానే ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను 1967 నంబర్‌తో ఏర్పాటు చేసింది. ఈనెల 11వ తేదీ నుంచి కాల్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రజలు సద్వినియోగం చేసుకుని అక్రమాలను అరికట్టవచ్చు.

– రాజా రఘువీర్, డీఎస్ఓ, కర్నూలు

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	4,222	8,001
పొద్దుతిరుగుడు	4,919	5,669
ఆముదం	4,239	6,449
ఉల్లి	1,159	1,510
ఎండు మిర్చి	389	35,189
శనగలు	4,410	4,561
కందులు	2.009	7,350
మొక్కజొన్న	1,050	2,190
మినుములు	6,589	7,069

ఆదోని మార్కెట్ యార్డు ధరలు

పత్తి	6,211	8,689
వేరుశనగ	4,599	6,750
ఆముదం	6,150	6,448
పూలవిత్తనాలు	5,711	5,775
కందులు	6,489	6,921



ప్రియురాలు దక్కలేదని..

- యువకుడు ఆత్మహత్య
- యువతి తల్లిదండ్రుల బెదిరింపే కారణమని ఫిర్యాదు



ప్రసన్నకుమార్(ఫైల్)

దొర్నిపాడు: ప్రేమించిన యువతి దక్కలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలపరిధిలోని చాకరాజువేముల గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. చాకరాజువేముల గ్రామానికి చెందిన జకరయ్య, రత్నమ్మ దంపతులకు ఒక కుమార్తె, ప్రవీణ్‌కుమార్, ప్రసన్న కుమార్ అనే ఇద్దరు కుమారులు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో కుమారులు ఉద్యోగం చేస్తున్నారు. ప్రసన్న కుమార్(24) అప్పుడప్పుడు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని పిన్ని ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో అక్కడ ఓ యువతితో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. విషయం తెలుసుకున్న సదరు యువతి తల్లిదండ్రులు మద్దిలేటిరెడ్డి, లక్ష్మీదేవి యువకుడిని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రసన్నకుమార్ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో విషగుళికలు మింగాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లి బంధువుల సాయంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తాము ఎస్సీ సామాజిక వర్గానికి చెందడంతో కుమార్తెను ఇచ్చి పెళ్లి చేసేందుకు ఇష్టం లేక యువతి తల్లిదండ్రులు తమ కుమారుడిని బెదిరించినట్లు ప్రసన్నకుమార్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువతి తల్లిదండ్రులతో పాటు మహేష్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి అనే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మానసిక ఒత్తిడితో..

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో అర్జున్‌రెడ్డి(32) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. జమ్మలమడుగుకు చెందిన అర్జున్‌రెడ్డి తన భార్య పిల్లలతో కలిసి బొమ్మలసత్రం సమీపంలోని జేఆర్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటూ స్థానిక ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడి తట్టుకోలేక మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు వారి ప్రత్యేకత పద్య నాటకం



భక్త ప్రహ్లాద నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: పద్య నాటకం తెలుగువారికి ప్రత్యేకమని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న సురభి నాటకాలను మూడో రోజు మంగళవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రాచీన కళల్లో ఒక్కటైన నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఇందు కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళలు సంస్కృతికి ప్రతిబింబాలన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కళాక్షేత్రంలో ప్రతి ఆదివారం ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రేక్షకులు సేద తీరి సంతోషంగా గడిపేందుకు చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సురభి కళాకారులచే ప్రదర్శించ బడిన భక్త ప్రహ్లాద నాటకం ఆకట్టుకుంది. సురభి కళాకారులను అతిథులు ఘనంగా సన్మానించారు. సురభి శంకర్‌కు రూ.2 లక్షలను కళాక్షేత్రం తరుపున అందజేశారు. కార్యక్రమంలో సాయి సుబ్బయ్య రవీంద్ర పాఠశాల అధినేత పి.బి.వి. సుబ్బయ్య, టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉత్సవాల కన్వీనర్ బాలవెంకటేశ్వర్లు, సమితి ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీఎన్‌ఏ పరీక్షలకు ససేమిరా!

- ఖరీఫ్ పత్తి పంటలు దెబ్బతినడంపై లోతుగా పరిశీలన
- డీఎన్‌ఏ పరీక్షలకు వ్యవసాయ శాఖ నిర్ణయం
- రెఫరెన్స్ శాంపిల్స్ పంపించాలని కంపెనీలకు ఆదేశం
- రెండు నెలలైనా స్పందించని విత్తన కంపెనీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట గతంలో ఎపుడూ లేని విధంగా దెబ్బతిన డానికి కారణాలను మరింత లోతుగా విశ్లేషించేం దుకు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే డీఎన్‌ఏ పరీక్షలకు విత్తన కంపెనీలు ఏ మాత్రం సహకరించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలంటే రైతుల పొలాల నుంచి లైవ్ శాంపుల్స్, కంపెనీల నుంచి విత్తన వెరైటీలకు సంబంధించిన రెఫరెన్స్ శాంపిల్స్ పంపాలి. రెండింటిని పరీక్షిస్తే తేడా తెలుస్తుంది. దీని ద్వారా పత్తి దెబ్బతినడానికి విత్తనం కారణమా... వాతావరణ పరిస్థితులే కారణమా.. అనేది స్పష్టమవుతుంది.

32 లైవ్ శాంపిల్స్ సేకరణ..

ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట దెబ్బతినడంపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గుంటూరు లామ్, నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల బృందం జిల్లాలో పర్యటించి పత్తి పంటను పరిశీలించింది. పత్తి పంట దెబ్బతినడానికి వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలు, చీడపీడలు కారణమని తేల్చింది. అయితే రైతులు, రైతు సంఘాలు మాత్రం విత్తనం కారణంగా పత్తి దెబ్బతినిందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ డీఎన్‌ఏ పరీక్షలు చేయించాలని నిర్ణయించింది. రెండు నెలల క్రితం వ్యవసాయ అధికారులకు లైవ్ శాంపిల్స్, కంపెనీలకు రెఫరెన్స్ శాంపిల్స్ పంపాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ యంత్రాంగం మాత్రం 32 లైవ్ శాంపిల్స్ కింద ఆకులు సేకరించి గుంటూరు డీఎన్‌ఏ ల్యాబ్‌కు పంపింది. అయితే కంపెనీలు మాత్రం స్పందించలేదు. శాంపిల్స్ పంపడం లేదంటే కంపెనీల్లోనే పత్తి పంట దెబ్బతినడానికి కారణాలు దాగి ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

8 కంపెనీలకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు

తులసీ సీడ్స్ అకీర 171 బీజీ2 రకం, అంకూర్ సీడ్స్ అంకూర్ 3228, మహికో సీడ్స్ ఎంఆర్‌సీ 7160, ఎంఆర్‌సీ 7161, గోల్డ్‌కాంట్ ఎస్‌సీఎస్864. కావేరి సీడ్స్‌మణిమేకర్, సూపర్ సీడ్స్ శ్రీభవ్య, సూపర్ 3జి, రాశీ సీడ్స్ ఎన్‌ఈవో 578, కర్షక్ క్రాప్ సైన్స్ సూపర్ వైట్, టియార సీడ్స్ డీపీసీ9085 రకాలకు రెఫరెన్స్ శాంపిల్స్ పంపాలని రెండు నెలల క్రితం వ్యవసాయ శాఖ ఆదేశించినప్పటికీ స్పందన లేదు. డీఎన్‌ఏ పరీక్షలకు కంపెనీలు సహకరించకపోతుండటాన్ని వ్యవసాయ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. రెఫరెన్స్ శాంపిల్స్ ప్రతి కంపెనీ ప్రతి రకానికి తీసి పెట్టి ఉంటుంది. రెఫరెన్స్ శాంపిల్స్ కింద ఆకులు, పత్తి విత్తనాలు, పత్తి కాయలు ఇలా ఏవైనా పంపవచ్చు. అయితే కంపెనీలు పట్టించుకోకపోవడం చర్చనీయాంశం అవుతోంది. నిర్లక్ష్యం వహిస్తున్న 8 కంపెనీలకు నోటీసులు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది.



మద్యం కేసులో జైలు శిక్ష

కర్నూలు: కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన తెలుగు వీరేష్ తెలంగాణ నుంచి కర్నూలుకు మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నేరం రుజువు కావడంతో సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాస్ కుమార్ తీర్పు ఇచ్చారు. కర్నూలు సెబ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు తెలుగు వీరేష్‌ను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. నాటుసారా, అక్రమ మద్యం, మత్తు పదార్థాలు కలిగి ఉండటం, విక్రయించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని గ్రహించాలని, మద్యం అక్రమ రవాణాదారులకు ఈ శిక్షతో కనువిప్పు కలగాలని కర్నూలు సెబ్ సీఐ ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు.

రేపు వివేకానంద జయంతి

కర్నూలు కల్చరల్: వివేకానంద రాక్ మెమోరియల్, వివేకానంద కేంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 8 గంటలకు వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్)లో వివేకానంద జయంతిని నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. మెమోరియల్, కేంద్ర సభ్యులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

సౌత్‌జోన్ పోటీలకు గిరిజన విద్యార్థులు



సౌత్ జోన్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కర్నూలు(అర్బన్): ఈ నెల 12, 13వ తేదీల్లో విజయవాడలో జరుగనున్న రెండవ జూనియర్ సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలకు నగరంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివకృష్ణ తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సతీష్, అభిషేక్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సౌత్ జోన్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆ విద్యార్థులకు, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ రమ్యను ప్రత్యేకంగా అభినందించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు

కర్నూలు(సెంట్రల్): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. సీఐటీ యూ అఖిల భారత మహాసభలు విజయవంతం కోసం మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. ఓల్డ్‌సిటీలో జరిగిన జెండావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..వెంటనే జీఓ నంబర్ ఒకటిని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.కృష్ణ, అబ్దుల్‌దేశాయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ నిరసన

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై హమాలీల నిరసన కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. మంగళవారం కర్నూలు ఎంఎల్‌ఎస్ పాయింట్ దగ్గర హమాలీలు నిరసన వ్యక్తం చేసి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2022 జనవరిలో సివిల్ సప్‌లై హమాలీల కూలీ రేట్లను రూ.22 నుంచి రూ.25కు పెంచినట్లు ప్రభుత్వం చెప్పిందని, అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు పెంచిన రేట్లను అమలు చేయలేదని సీఐటీయూ సివిల్ సప్‌లై హమాలీల యూనియన్ జిల్లా కార్యదర్శి బజారప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సోలమన్‌రాజు, ఆర్‌కృష్ణ, ఎం.విజయ్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

కర్నూలు(సెంట్రల్): దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయనతో పాటు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.గిడ్డమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఢిల్లీలో ఇటీవల ఓ మహిళలను అందరూ చూస్తుండగానే విచక్షణ రహితంగా అత్యాచారం చేసి చంపేశారన్నారు. దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునేనాథుడు కరువయ్యాడన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పి.శ్రావణిరెడ్డి, ఉపాధ్యక్షురాలుగా నాగేశ్వరమ్మ, మహేశ్వరమ్మ, సుధాదేవి, పుష్ప, కార్యదర్శిగా వరలక్ష్మీలు ఎన్నికయ్యారు. నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జీఓ ఒకటిని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ర్యాలీలు, రోడ్ షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ ఒకటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో పలు చోట్లా జీఓ ప్రతులను దహనం చేశారు. చిల్డ్రన్స్ పార్కు దగ్గర జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..బ్రిటీషు కాలం నాటి చట్టాలను అమలు చేయడం తగదన్నారు. వెంటనే విడుదల చేసిన జీఓను రద్దు చేయాలన్నారు.

12న సంక్రాంతి సంబరాలు

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘచాలక్ సూరా వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటలకు వీర్ కాలనీలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి అడిషనల్ డీఎంఈ డాక్టర్ పి.చంద్రశేఖర్, ముఖ్య వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు రామ్ మాధవ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి సినిమాలు

- **ఎస్‌వీసీ కాంప్లెక్స్** : అవతార్ ది వే ఆఫ్ వాటర్ తెగింపు. ధమాకా
- **వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్** : 18 పేజెస్, ధమాకా, కింగ్‌డమ్ ఆఫ్ ది డైనోసార్స్ తెగింపు
- **వెంకటేష్ సినీ కాంప్లెక్స్** : ధమాకా ,మైఖేల్ గ్యాంగ్, తెగింపు
- **ఐనాక్స్** : అవతార్ ది వే ఆఫ్ వాటర్
- **భరత్ కాంప్లెక్స్** : ఒక్కడు
- **రాజ్** :ధమాకా
- **శ్రీరామ**: ఒక్కడు
- **విజయ** : 18 పేజెస్

గణతంత్ర వేడుకలను జయప్రదం చేయండి

- జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర వేడుకల నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 12 శాఖలకు శకటాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. వాహనాలకు నాలుగు వైపులా ఆ శాఖ ప్రాముఖ్యతను తెలిపేలా సందేశాలు ఉండాలన్నారు. హౌసింగ్, విద్యా, డీఆర్‌డీఏ, డ్వామా, ఆరోగ్య, వ్యవసాయం, సర్వే, అగ్నిమాపక తదితర శాఖలు ఏర్పాటు చేసే శకటాలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. అలాగే 20 శాఖలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలాన్నరు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల వివరాలను సేకరించాలని, వారికి ఉత్తమ సేవాపతకాలు ఇవ్వనున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డి బురుజుకు 'న్యూలుక్' తెస్తాం

- మేయర్ బివై.రామయ్య

కర్నూలు (టౌన్): నగరంలోని చరిత్రాత్మక కట్టడం కొండారెడ్డి బురుజుకు న్యూలుక్ తీసుకువస్తామని కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న సుందరీకరణ పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలు అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది కొండారెడ్డి బురుజు అన్నారు. దీంతో ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగానే ఓపెన్ థియేటర్ తొలగించి ఆ స్థలంలో పార్కు, వాటర్ ఫౌంటెన్ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మరో నాలుగు నెలల వ్యవధిలో ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. ప్రస్తుతం నగరంలో రూ.5 కోట్లు విలువ చేసే సుందరీకరణ పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఆరు నెలల వ్యవధిలో సుందరీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



కొండారెడ్డి బురుజు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మేయర్

పతకాలు సాధించడం అభినందనీయం

కర్నూలు (టౌన్): ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాదులోని కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు నగరానికి చెందిన ఎ.బి. అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన సంతోష్‌నాయక్ (బంగారు), ఇంద్రకుమార్, శ్రీవరుణ్, జశ్వంత్‌గౌడ్, సుమంత్(వెండి పతకాలు) లను మంగళవారం నగర మేయర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ రామయ్య

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా ప్రాంతంలోని అలీషా మసీదుకు చెందిన సర్వే నంబర్ 311 వక్ఫ్ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఇన్సాఫ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎన్‌రసూల్ డిమాండ్ చేశారు. మంగళవారం పనులు జరుగుతున్న భవనం దగ్గర ఇన్సాఫ్ కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్ బాష, మున్నా, షేక్షా తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఇన్సాఫ్ కమిటీసభ్యులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ సూచించారు. మంగళవారం బీక్యాంప్‌లోని గ్రంథాలయ శాఖను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశాడు. గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు అవసరమైన ఎటువంటి పుస్తకాలైనా గ్రంథాలయ రికార్డుల్లో నమోదు చేస్తే తక్షణం కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



బీక్యాంప్ గ్రంథాలయంలో సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న, చైర్మన్ సుభాష్ చంద్రబోస్

రక్తహీనతపై నిర్లక్ష్యం వద్దు



చిన్నారిని పరీక్షిస్తున్న ఐడీసీఎస్ పీడీ కుమారి

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నారుల్లో రక్తహీనత పట్ల నిర్లక్ష్యం వహించరాదని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కేఎల్‌ఆర్‌కే కుమారి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో రక్తహీనత ఉన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక పౌష్టికాహారం అందజేస్తున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం న్యూట్రిషన్ రిసోర్స్ సెంటర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

మామిదాలపాడు వద్ద జంక్షన్ ఏర్పాటు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని మామిదాల పాడు వద్ద జంక్షన్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. మంగళవారం టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ మోహన్ కుమార్‌తో కలిసి కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జంక్షన్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడుతుందని కమిషనర్ వెల్లడించారు. అలాగే నగరంలోని వాణిజ్యనగర్‌లో ఆక్రమణలను తొలగించారు. స్థానికంగా ఫిర్యాదుల మేరకు నగరపాలక అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, టీపీఎస్ దామోదర్ ఆధ్వర్యంలో కాలనీలలో పర్యటించారు. ఇళ్ల వద్ద రోడ్లను ఆక్రమించి ర్యాంపులు ఏర్పాటు చేసుకోవడం, మురుగు కాల్వలను బ్లాక్ చేయడంతో వాటిని తొలగించారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఓల్డ్ టౌన్ సెక్షన్ కార్యాలయంలో జెండావిష్కరణకు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దామోదరం సంజీవయ్య థర్మల్ ప్లాంట్ ప్రైవేటుకు లీజుకు ఇచ్చే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఈపీఎఫ్‌ను జీపీఎస్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు సంఘం నాయకులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు విజయేంద్రచారి, తిరుమలయ్య, భాస్కరరావు, గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ మూడవ వార్డు పరిధిలో మంగళవారం నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, పారిశుద్ధ్యంపై ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి పారిశుద్ధ్యంపై తనిఖీలు నిర్వహించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ షేక్ షాజహాన్ పర్వీన్ ఫిర్యాదు మేరకు బండిమెట్టలో పారిశుద్ధ్యం తనిఖీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ ఆల్‌మేవ) 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎంవోలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్‌మేవ జిల్లా అధ్యక్షుడు సర్దార్ అబ్దుల్ హమీద్, ఉర్దూ యూనివర్శిటీ చైర్మన్ హెచ్.నదీమ్ అహ్మద్, ఏపీ ఆల్‌మేవ రాష్ట్ర అధ్యక్షుడు దాదాబాష, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ మహబూబ్‌పీర, జిల్లా నాయకులు ఇలియాస్ బాష పాల్గొన్నారు.

నర్సింగ్ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): ఏపీ నర్సింగ్ సంక్షేమ సంఘం -2023 క్యాలెండర్‌ను మంగళవారం నర్సింగ్ విద్యా సంస్థల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరుగు విజయవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. బిర్లాకాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకోట మోహన్, ఎస్వీఆర్ నర్సింగ్ కళాశాల అధినేత హరిప్రసాద్‌రెడ్డి, సీతారామ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ అధినేత విజయ రాఘవేంద్రగౌడ్ పాల్గొన్నారు.



ఏపీ ఆల్‌మేవ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

అర్చక సంక్షేమ నిధి ట్రస్ట్ బోర్డు సభ్యునిగా శ్రీనివాసాచార్యులు

కర్నూలు కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ అర్చక సంక్షేమ నిధి ట్రస్ట్ బోర్డును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న కోటపాడు గ్రామానికి చెందిన పి.శ్రీనివాసాచార్యులు సభ్యునిగా నియమితులయ్యారు. జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు సూర్యనారాయణ, చిట్యాల బసవ రాజు హర్షం వ్యక్తం చేశారు.

'చర్యలు తీసుకోవాలి'

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అధికారి గురవయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు గౌడ్, నాయకులు విజయేంద్ర, షబ్బీర్ బాష, రంగస్వామి, అల్తాఫ్, శరత్‌కుమార్, వెంకటేష్, మునిస్వామి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

కర్నూలు(రాజ్‌విహార్): చిన్న చిన్న చిత్రాల్లో నటిస్తున్న కర్నూలు వాసి, ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి బైటింటి మీనాక్షిరెడ్డిని ప్రజా రవాణ శాఖ ఉద్యోగులు సన్మానించారు. ఆయన ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్డుల జారీ కమిటీ సభ్యుడిగా నియామకం కావడంతో మంగళవారం స్థానిక రీజినల్ మేనేజరు కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ నారాయణ, ఉద్యోగులు మద్దిలేటి, హుసేన్, సరిత, నటుడు మారుతి సాకారామ్, దర్శకుడు సాధిక్ పాల్గొన్నారు.

18న ఏకాంకిక పోటీలు

కర్నూలు కల్చరల్: శతాబ్ది మహానటుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పౌరాణిక ఏకాంకిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. జనవరి 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీక్యాంప్ కళాక్షేత్రంలో పోటీలు జరుగుతాయన్నారు. 40 నిమిషాల వ్యవధిలోగా ఏకాంకిక ప్రదర్శన పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతి ఏకాంకిక బృందానికి రూ.2000, పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10,000, ద్వితీయ స్థానానికి రూ.8,000, తృతీయ స్థానానికి రూ.6,000 నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు జనవరి 12వ తేదీలోగా సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వివరాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాక్షేత్రం కోశాధికారి లక్ష్మీకాంతరావు సెల్ నంబర్‌లో 93938 11097 సంప్రదించాలన్నారు.

కేశవరెడ్డి స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు

కర్నూలు సిటీ: కేశవరెడ్డి విద్యా సంస్థల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గొబ్బెమ్మలతో కూడిన రంగవల్లులను తీర్చిదిద్దారు. అదేవిధంగా గాలిపటం ఎగుర వేయించడం, బొమ్మల కొలువులు, చిన్నారులకు భోగిపళ్లు వేయించడం, హరిదాసు, పగటి వేషధారుల వేషాలతోపాటు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేశవరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే పండుగల గురించి పిల్లలకు తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమాల్లో ఆయా బ్రాంచ్‌ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): ఈ నెల 11 నుంచి 13 వరకు పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించనున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ అన్నారు. మంగళవారం అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటున్న మహిళా హాకీ జట్టును ఆయన ప్రకటించారు. ఎంపికైన వారిలో ఫర్హానా, ప్రతిభా, భారతి (ఆదోని), మల్లీశ్వరీ (పాములపాడు), ప్రసన్న, రాణీ, నవ్యరాణీ (కర్నూలు), పల్లవి, అక్షయ, భవిత, సూర్జియా బేగం, మానస, సునీత, హిమబిందు, ధనలక్ష్మీ (గార్గేయపురం), శ్రీలత (నంద్యాల)లు ఉన్నట్లు వెల్లడించారు.

క్రీడాకారులకు అభినందన : ఈ నెల 7 నుంచి 9 వరకు కళ్యాణదుర్గంలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు బాలుర జట్టు రెండవ స్థానంలో నిలిచింది. జట్టు సభ్యులను డీవీఈఓ జమీర్‌బాష, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి ఆర్ఐఓ కార్యాలయంలో అభినందించారు.

ఆర్చరీ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థి

ఈ నెల 13 నుంచి 17 వరకు విజయవాడలో నిర్వహించనున్న 5వ జాతీయ స్థాయి అండర్-9 చెరుకూరి లెనిన్ వోల్గా ఆర్చరీ పోటీలకు ఏ.క్యాంపు మాంటిస్సోరి విద్యార్థి కె.పార్థచంద్ర ఎంపికయ్యారు. జాతీయ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం జ్యోతి అభినందించారు.

జీరో వేస్ట్‌ను అమలు చేద్దాం

కర్నూలు (టౌన్): జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేద్దామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కర్నూలు నగరంలో వివాహ కార్యక్రమాలు, ఫంక్షన్లు, వినోద కార్యక్రమాల్లో ఎక్కువగా చెత్త ఉత్పత్తి కాకుండా నగరపాలక సంస్థ జీరో వేస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జీరో వేస్ట్ కార్యక్రమాలకు నగర ప్రజలు ఇందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణుల పట్ల ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని సిబ్బంది అయిన ఆశ, ఏఎన్‌ఎంలు త్వరగా గర్భిణులను గుర్తించి వారిని ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించి, అవసరమైన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులు వారిలో ఉంటే నిత్యం వారిని పర్యవేక్షణలో ఉంచాలన్నారు. కాన్పుకు వారం రోజుల ముందుగానే వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తే మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. అంతకుముందు ఆయన కలుదేవకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని సింగరాజుపల్లెకు చెందిన గర్భిణి డిసెంబర్ 13వ తేదీన అధిక రక్తస్రావం వల్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించినట్లు నిర్ధారించి, దానిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాంజీనాయక్, డీఐవో డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ గోపిచంద్, డాక్టర్ ప్రియాంక, కలుదేవకుంట్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవిందమ్మ, డీపీహెచ్‌ఎన్‌వో లిన్సెంట్ లిడియా పాల్గొన్నారు.



మాతృమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య

ఓవరాల్ చాంపియన్‌గా వైఎస్సార్ జిల్లా

- రన్నర్స్‌గా కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్స్‌గా బాలుర విభాగంలో 244 పాయింట్లతో వైఎస్సార్ జిల్లా జట్టు నిలిచింది. అదేవిధంగా 206 పాయింట్లతో కర్నూలు జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. బాలికల విభాగంలో 247 పాయింట్లతో వైఎస్సార్ జిల్లా జట్టు విన్నర్స్‌గా, పశ్చిమగోదావరి జిల్లా జట్టు 221 పాయింట్లతో రన్నర్స్‌గా నిలిచాయి. రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వెయిట్‌లిఫ్టింగ్ హాలులో నిర్వహించిన ఈ పోటీలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. విజేతలుగా నిలిచిన జట్లకు స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజ రావు,ఎ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలిలు కప్‌లు అందజేశారు.



రన్నర్స్‌గా నిలిచిన కర్నూలు బాలుర జట్టు



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రీక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రీక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హ్యుక్-సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.



కోహ్లి సెంచరీ అభివాదం

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలి షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.



9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

సినిమా

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు



ప్రతిష్టాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతార' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



- ఎస్ఎస్ తమన్

''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవి గారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.

నా కల తీరుతోంది



- సంతోష్ శోభన్

''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.